


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 26-07-2026 సంపుటి : 08 సంచిక 43 పేజీలు : 8 వెల : రూ 3-00


# గుంతకల్-బళ్లారి 3, 4 రైల్వే లైన్లకు ఆమోదంపై సీఎం చంద్రబాబు హర్షం



అమరావతి, జులై 25: గుంతకల్ - బళ్లారి మధ్య 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు తూర్పు-పడమర రైల్వే కారిడార్‌ను మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. రాయలసీమ, ఉత్తర కర్ణాటక, గోవా మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని అన్నారు. రైల్వే రద్దీ తగ్గనుందని.. ప్రయాణీకులు, సరుకుల రవాణాను వేగవంతం చేస్తుందన్నారు.రూ.1264 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో దాదాపు రూ.600 కోట్లు ఏపీలో ఖర్చుకానున్నాయని సీఎం వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ పారిశ్రామిక వృద్ధిని పెంచడంతో పాటు.. కృష్ణపట్నం, రాబోయే రామాయపట్నం పోర్టుకు అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందన్నారు. కొత్త ఆర్థిక అవకాశాలు ఏర్పాడి.. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వ్యాప్తంగా లక్షలాది మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల నిర్మాణానికి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిరంతర మద్దతుకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

ఢిల్లీ, జులై 25: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ పోటీ పరీక్షలో పేపర్ లీక్, పరీక్షల నిర్వహణపై తలెత్తిన వివాదాలు, విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వెలుగులోకి రావడంతో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు నిరసనలు చేపట్టి, పేపర్ లీక్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.




ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పరీక్షల వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు?2026 ముసాయిదాను విడుదల చేసి, పేపర్ లీక్‌లు, పరీక్షల అక్రమాలపై కఠిన శిక్షలు, భారీ జరిమానాలు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, కాలపరిమితిలో విచారణ వంటి కీలక నిబంధనలను ప్రతిపాదించింది.మరోవైపు, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో కేంద్ర మంత్రివర్గంలో విద్యాశాఖ బాధ్యతలను ఎవరు చేపడతారనే అంశంపై ఆసక్తి నెలకొంది. త్వరలోనే కొత్త విద్యాశాఖ మంత్రిని నియమించే అవకాశం ఉంది. అయితే రాజీనామాపై కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన, రాష్ట్రపతి ఆమోదం, తదుపరి బాధ్యతల కేటాయింపుపై పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. ఇదిలా ఉండగా, విద్యార్థి సంఘాలు ఈ పరిణామాన్ని స్వాగతిస్తూ, పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, బాధ్యులపై కఠిన చర్యలు, దీర్ఘకాలిక సంస్కరణలు అమలు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాయి.

# రైతులకు కేంద్రం భారీ శుభవార్త..

## త్వరలో మీ ఖాతాలలో ఆ డబ్బులు!



అమరావతి, జులై 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతాంగ సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోంది. ఇందులో భాగంగా పంటల బీమా పథకాన్ని కూడా అందిస్తోంది. అయితే తాజాగా ఏపీ రైతులకు కేంద్రం శుభవార్త చెప్పింది. 2024 ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన పంటల బీమా పెండింగ్ బకాయిల విడుదలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో చర్చించిన మంత్రి అచ్చెన్నాయుడు ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో జరిగిన చర్చల ఫలితంగా ఈ బకాయిల విడుదలకు మార్గం సుగమమైంది .ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు వెల్లడించారు.ఢిల్లీలో ఆయన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో భేటీ అయ్యి రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న బీమా బకాయిల విషయాన్ని చర్చించారు. 2024 ఖరీఫ్ పంటల బీమా బకాయిలు విడుదలకు కేంద్రాన్ని ఒప్పించిన అచ్చెన్న గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన 2024 ఖరీఫ్ పంటల బీమా బకాయిలు విడుదల చేసేందుకు ఎట్టకేలకు కేంద్రాన్ని ఒప్పించి, విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇప్పించినట్టు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల సంక్షేమానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా, సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్టు గా మంత్రి పేర్కొన్నారు. పంట నష్టం జరిగితే బీమా సాయమే రైతన్నకు కాస్త ధీమా బీమా బకాయిల విడుదలకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పంటల బీమా పథకం రైతులు వేసిన పంటకు సంబంధించిన ఆర్థిక భద్రతను కల్పించే కీలక పథకం. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, పంట నష్టం జరిగినప్పుడు బీమా సాయం అందితే రైతులు కొంత ఉపశమనం పొందుతారు. లేదంటే రైతుల జీవితం ఆర్థికంగా అల్లకల్లోలంగా మారుతుంది. మినీ మాల్దీవులుగా సోమశిల, క్రూయిజ్ విహారం.. తెలంగాణా టూరిజం నయా ప్లాన్! వేలాది మంది రైతులకు ప్రభుత్వ సాయం వల్ల కొంత ఉ పశమనం అయితే గతంలో గత ప్రభుత్వ హయాంలో విడుదల కావలసిన పంట బీమా ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం మంత్రి చొరవతో కేంద్రం ఆమోదంతో ఈ డబ్బులు త్వరలోనే బకాయిలు విడుదల అవుతాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల చాలామంది రైతులకు ఆర్థిక సాయం అందుతుంది. వేలాది మంది రైతులు ప్రభుత్వ సాయం వల్ల కొంత ఉపశమనం పొందుతారు. అయితే కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలోనే రైతుల ఖాతాల్లోకి నేరుగా పంటల బీమా బకాయిలు వచ్చి పడతాయని మంత్రి చెబుతున్నారు.

# సింహపురి ఈ-బస్సు డిపో పవర్ రూమ్‌ను ప్రారంభించిన మంత్రి మండిపల్లి

అమరావతి, జులై 25: రవాణా రంగంలో 'ఖఓ వ- ఃబీబ ౕావలిజీ' తో నూతన శకం మొదలైంది. విశాఖలోని సింహపురి ఈ-బస్సు డిపో పవర్ రూమ్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. 'ఖఓ వ-ఃబీబ ౕావలిజీ' పథకం కింద ఏర్పాటవుతున్న సింహపురి ఈ-బస్సు డిపోను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విశాఖకు కేటాయించిన 100 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణకు ఆధునిక పవర్ రూమ్ సిద్ధమైందని మంత్రి తెలిపారు. పవర్ రూమ్‌తో పాటు సబ్‌స్టేషన్, ఛార్జింగ్ స్టేషన్ తదితర మౌలిక సదుపాయాలు వేగంగా పూర్తికానున్నాయన్నారు.మరో రెండు నుంచి మూడు నెలల్లో ఈ-బస్సులు అందుబాటులోకి వస్తాయని మంత్రి వెల్లడించారు. ఈ-బస్సుల రాక నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రానికి తొలి దశలో 750 ఈ-బస్సులు రాగా.. అందులో విశాఖకు 100 బస్సులు కేటాయించినట్లు చెప్పారు. ప్రస్తుత బస్సులతో పాటు కొత్త ఈ-బస్సులతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని వెల్లడించారు.



# కేంద్రంతో చర్చలు సఫలం..


## జంతర్ మంతర్ వద్ద నుంచి విద్యార్థులు వెనక్కి

న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) డిమాండ్లను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. నీట్ (యూజీ) పరీక్షలో జరిగిన అవకతవకల కారణంగా సిజెపి ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ధర్మేంద్ర రాజీనామాతోపాటు, మరో రెండు డిమాండ్లపై చర్చించేందుకు కేంద్ర మంత్రులు జెపి నడ్డా, జితేంద్ర సింగ్ ల పిలుపు మేరకు సీజేపీతో ప్రతినిధులు వారితో సమావేశమయ్యారు. కేంద్ర మంత్రులతో సీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, సీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అశుతోష్ రాంకా దాదాపు రెండు గంటలపాటు జరిగిన చర్చల అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిజెపి ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రధానంగా మూడు డిమాండ్లపై కేంద్రంతో చర్చించామని... ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తమ మొదటి డిమాండ్ నెరవేరిందని తెలిపారు. ఢిల్లీ, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పాలిత అన్ని రాష్ట్రాల్లోని విద్యార్థులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవడానికి ప్రభుత్వం అంగీకరించిందని.. నిరసనకారులపై భవిష్యత్తులోనూ ఎలాంటి చర్యలు తీసుకోబోమని హామీ ఇచ్చిందని తెలిపారు.ఇక, ఆత్మహత్య చేసుకుని మరణించిన నీట్ అభ్యర్థుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం అందించాలన్న తమ డిమాండ్‌కు కూడా ప్రభుత్వం అంగీకరించిందని..నియమ నిబంధనలు మేరకు బాధిత కుటుంబాలకు పరిహారం అందిస్తామని హామి ఇచ్చినట్లు చెప్పారు. మరిన్ని కనుగొనండి రాష్ట్ర వార్తలు సేవ ఔవలిబజూజీజూవతీబ తెలంగాణ వార్తలు సేవ కాగా, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, విద్యార్థుల డిమాండ్లన్నింటినీ ప్రభుత్వం అంగీకరించడంతో సిజెపి తమ ఆందోళనను విరమించుకుంటున్నట్లు ప్రకటించింది. అలాగే, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నుంచి నిరసనకారులను శాంతియుతంగా వెనుదిరగాలని కోరింది.





# రెంటికీ చెడ్డా చెవిరెడ్డి



తిరుపతి జూలై 25, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒకప్పుడు అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, నమ్మినబంటుగా చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు తీవ్ర అంధకారంలో పడినట్లే కనిపిస్తోంది. పార్టీలో ఆయనకు దక్కిన ప్రాధాన్యత, హోదా మరే నాయకుడికీ లభించలేదనడంలో సందేహం లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా ఒంగోలు లోక్‌సభ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు అప్పగించడమే కాకుండా, ఎంపీ టికెట్ ఇచ్చి మరీ బరిలోకి దించారు. కానీ, మారిన పరిస్థితులు, అంతర్గతంగా బయటపడిన సంచలన నిజాలు జగన్ మోహన్ రెడ్డికి తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయని, ఫలితంగానే చెవిరెడ్డిని పార్టీ యాజమాన్యం పూర్తిగా పక్కన పెట్టేసిందనే చర్చ వైసీపీ వర్గాల్లో తీవ్రంగా సాగుతోంది. జగన్ అగ్రహానికి ప్రధాన కారణం లిక్కర్ స్కామ్ వ్యవహారమేనని పార్టీ వర్గాలు నమ్ముతున్నాయి. పాలనలో మద్యం విధానం రూపకల్పన, డిస్టిలరీల వ్యవహారాల్లో చెవిరెడ్డి కీలక పాత్ర పోషించారని, అయితే ఆ ప్రక్రియలో జగన్ రెడ్డికి, పార్టీకి తెలియకుండా పెద్ద ఎత్తున నిధులు మళ్లించి, తన స్వప్రయోజనాల కోసం డబ్బులు మిగుల్చుకున్నారని సిట్ లెక్కల్లో తేలింది. మద్యం కుంభకోణంలో సొంత మనుషులే తనను మోసం చేశారనే క్లారిటీ జగన్‌కు రావడంతో, చెవిరెడ్డి పట్ల ఉన్న నమ్మకం కాస్తా తీవ్ర అసంతృప్తిగా మారింది. ఆ దెబ్బతోనే ఆయనకు జగన్ దగ్గర ఎంట్రీ బంద్ అయిందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో నిత్యం దర్శనమిచ్చే చెవిరెడ్డి, ఇప్పుడు కనీసం జగన్ పక్కన నిలబడే అర్హతను కూడా కోల్పోయినట్లయింది. గత కొన్ని నెలలుగా జగన్ మీడియా సమావేశాల్లో కానీ, ముఖ్యమైన పార్టీ సమావేశాల్లో కానీ ఆయనెక్కడా కనిపించకపోవడం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డికి తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున టికెట్ దక్కే అవకాశాలు దాదాపు శూన్యమని పొలిటికల్ కారిడార్‌లో టాక్ నడుస్తోంది. పరిస్థితిని బట్టి చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఆయన కుమారుడు మోహిత్ రెడ్డికి ఏమైనా అవకాశం కల్పిస్తారా అంటే.. అప్పటివరకు ఉండే రాజకీయ సమీకరణాలు, జగన్ ఆలోచనా విధానాన్ని బట్టి అది కూడా అనుమానాస్పదమేనని తెలుస్తోంది. సజ్జల వర్గం గనుక చెవిరెడ్డిని మరింతగా టార్గెట్ చేస్తే, ఆయన ఇక వైసీపీలో మనుగడ సాగించడం అసాధ్యమనే భావనకు పార్టీ శ్రేణులు వస్తున్నాయి. జగన్ దయ కోల్పోయిన నాయకుడికి వైసీపీలో భవిష్యత్తు లేదనేది బహిరంగ సత్యం. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండాల్సిన నాయకుడే నమ్మకద్రోహం' చేశాడనే ముద్ర పడటంతో, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రాజకీయ జీవితానికి గండం తెచ్చి పెట్టింది. సజ్జల వ్యూహాలకు బలైపోతున్న చెవిరెడ్డి, వైసీపీని వీడి వేరే దారి చూసుకుంటారా లేక రాజకీయంగా మౌనం పాటిస్తూ కాలానికి వదిలేస్తారా అనేది వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా, వైఎస్ జగన్ సొంత గుడారంలో చెవిరెడ్డి చాప్టర్ దాదాపు ముగింపునకు వచ్చిందనేది ఎక్కువ మంది నమ్ముతున్న అంశం.

# ‘మీభూమి-బ్లాక్ చెయిన్’

విజయవాడ జూలై 25, భూ రికార్డుల నిర్వహణలో సాంకేతిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో విడివిడిగా ఉన్న భూ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తూ, రాష్ట్రంలోని భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా నిలిచే ‘మీభూమి?బ్లాక్ చెయిన్’ వ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ ద్వారా భూ రికార్డులు డిజిటలైజ్ అయినప్పటికీ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో సమాచారం వేర్వేరుగా ఉండటం వల్ల డేటా వ్యత్యాసాలు, రికార్డుల్లో మార్పులను గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మీ భూమి?బ్లాక్ చెయిన్ వ్యవస్థను రూపొందించారు. ఔఎఅ ఆంధ్రప్రదేశ్, ఔఎఅ బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఈ వ్యవస్థలో ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక బ్లాక్‌చెయిన్ గుర్తింపు కల్పిస్తారు. ప్రతి లావాదేవీ టాంపర్-ప్రూఫ్, సెక్యూర్టీతో జరగనుంది. భూ రికార్డుల్లో ఎలాంటి మార్పు చేయాలన్నా ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవల ద్వారానే ఇకపై సాధ్యమవుతుంది. ఒక భూ పార్సెల్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవీలు, వాటి ప్రతి వెర్షన్ సహా శాశ్వతంగా నమోదయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. ఇక ప్రతి లావాదేవీని ఏ అధికారి, ఎప్పుడు నిర్వహించారనే వివరాలు కూడా శాశ్వతంగా రికార్డుల్లో ఉంటాయి. రికార్డుల్లో ఏమైనా వ్యత్యాసం ఉంటే లావాదేవీ వెంటనే ఆగిపోయేలా వ్యవస్థను రూపొందించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ వ్యవస్థలో ప్రస్తుతం ఆటో మ్యూటేషన్, సబ్-డివిజన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్ సహా ఎనిమిది పౌర సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయం, మత్స్యశాఖ, గనులు, పరిశ్రమలు, విద్యుత్ శాఖ, సీఆర్‌డీఏ, ఆర్థిక సంస్థలు వంటి విభాగాలు కూడా అవసరమైన మేరకు ఈ సమాచారాన్ని వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని అస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టుగా అమలుకానుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 89 రీ-సర్వే గ్రామాలు, 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ అవుతున్నాయి.



# ప్రత్యక్ష ఎన్నికల దిశగా అడుగులు

విజయవాడ, జూలై 25, ఆంధ్రప్రదేశ్ రాజకీయం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఓ భారీ మలుపు తిరగబోతోంది. స్థానిక సంస్థల్లో ఏళ్ల తరబడి శాపంగా మారిన క్యాంప్ రాజకీయాలు , బేరసారాలు, బెదిరింపులకు శాశ్వతంగా చరమగీతం పాడేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య సంస్కరణకు రూపకల్పన చేస్తున్నారు. మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా పరిషత్ ( చైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులను ప్రజలే నేరుగా ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పరోక్ష ఎన్నికల పేరిట స్థానిక సంస్థల్లో సాగుతున్న ప్రజాస్వామ్య హననాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు భావిస్తున్నారు. పరోక్ష ఎన్నికల విధానంలో గ్రామ, వార్డు స్థాయి ప్రజాప్రతినిధులను ఎన్నుకున్న తర్వాత, వారు తమ నాయకుడిని ఎన్నుకుంటారు. ఈ క్రమంలో అధికార బలం, ఆర్థిక ప్రాబల్యం, పోలీసు వ్యవస్థ దుర్వినియోగం పీక్ స్టేజ్‌కు చేరుకుంటాయి. మెజార్టీ రాని అధికార పార్టీలు కూడా ప్రతిపక్షాల నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులను రిసార్టులకు తరలించడం, క్యాంపులు నిర్వహించడం, రకరకాల ఒత్తిళ్లకు గురిచేసి తమవైపు తిప్పుకోవడం ఆనవాయితీగా మారింది. చివరికి ప్రజల తీర్పు ఒకటైతే, పీఠంపై కూర్చునేది మరొకరయ్యే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ అక్రమ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజల చేతికే నేరుగా ఓటు హక్కు ఇవ్వడమే ఏకైక మార్గమని భావిస్తున్నారు. సాధారణంగా ఏ అధికార పార్టీ కూడా ఇటువంటి ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకురావడానికి సాహసించదు. ఎందుకంటే, పరోక్ష విధానం ఉంటే వార్డుల్లో సీట్లు తగ్గినా, సర్పంచ్ లేదా కౌన్సిలర్లను లొంగదీసుకుని మున్సిపాలిటీలు, జడ్పీలను కైవసం చేసుకునే వెసులుబాటు అధికారంలో ఉన్న పార్టీకి ఉంటుంది. అయితే, అక్రమ మార్గాల్లో పీఠాలను దక్కించుకునే సంస్కృతి కంటే, పారదర్శకమైన ప్రజా తీర్పుకే ప్రాధాన్యత ఇవ్వాలనేది సీఎం చంద్రబాబు వ్యూహంగా కనిపిస్తోంది. పరోక్ష ఎన్నికల్లో జరిగే కోట్లాది రూపాయల బేరసారాలకు స్వస్తి పలికితే, స్థానిక సంస్థల్లో జవాబుదారీతనం పెరుగుతుందనేది నమ్మకం. గత చరిత్రను పరిశీలిస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. 1987లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలో తొలిసారిగా మున్సిపల్ చైర్మన్లు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులకు నేరుగా ప్రజలే ఓటు వేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 2000వ దశకం ప్రారంభంలో చంద్రబాబు హయాంలోనూ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను నేరుగా ఎన్నుకునే పద్ధతి నడిచింది. అయితే, కౌన్సిల్‌లో ఒక పార్టీకి మెజార్టీ ఉండి, మేయర్, చైర్మన్ మరొక పార్టీకి చెందినవారు గెలిస్తే పాలనలో ప్రతిష్టంభన ఏర్పడుతోందనే నెపంతో తర్వాతి ప్రభుత్వాలు మళ్లీ పరోక్ష విధానానికే మొగ్గు చూపాయి. చట్టపరమైన కోణంలో చూస్తే.. భారత రాజ్యాంగంలోని 243అ పంచాయతీలు, 243ఖీ మున్సిపాలిటీలు నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల అధ్యక్షుల ఎన్నికల విధానాన్ని నిర్ణయించే సర్వాధికారాలు రాష్ట్ర శాసనసభలకే ఉన్నాయి. దీనికోసం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం-1994 , అలాగే ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం-1965 , మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం-1994లకు అసెంబ్లీలోసవరణలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత కూటమికి అసెంబ్లీలో అత్యధిక మెజార్టీ ఉన్నందున, ఈ చట్టసవరణ చేయడం ప్రభుత్వానికి సునాయాసమైన ప్రక్రియే కానుంది. ఈ ప్రత్యక్ష విధానం అమల్లోకి వస్తే రాజకీయ పార్టీలపై, స్థానిక నాయకత్వంపై తీవ్ర ప్రభావం పడనుంది. కేవలం డబ్బు సంచులతో కౌన్సిలర్లనుకొనుగోలుచేసే ధనస్వామ్య నాయకులకు కాలం చెల్లి, ప్రజల్లో మంచి గుర్తింపు, ఆమోదయోగ్యత ఉన్న నాయకులకే పార్టీలు బీ-ఫారాలు ఇవ్వాల్సి వస్తుంది. ఒక వేళ కౌన్సిల్‌లో ప్రతిపక్షాల బలం ఎక్కువగా ఉన్నా, ప్రజల చేత నేరుగా ఎన్నుకోబడిన మేయర్, చైర్మన్ బడ్జెట్ ఆమోదం, పాలనా నిర్ణయాల్లో అందరినీ సమన్వయం చేసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అధికారంలో ఉండి కూడా పరోక్ష లబ్ధిని వదులుకుని ప్రత్యక్ష ఎన్నికలకు వెళ్లడం ఒక రాజకీయ తెగువగా అభివర్ణించవచ్చు. ఈ ప్రతిపాదన గనుక చట్టరూపం దాల్చి అమల్లోకి వస్తే, భవిష్యత్తులో దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆంధ్రప్రదేశ్ స్థానిక పాలనలో మార్గదర్శిగా నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి

# అమర్ రాజా చుట్టూ రాజకీయం

గుంటూరు జూలై 25, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి గిగా కారిడార్‌లో అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సంస్థకు చెందిన అడ్వాన్స్‌డ్ కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ విజయవంతంగా ప్రారంభమవ్వడం పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. నాలుగు దశాబ్దాలుగా చిత్తూరు నేలను కేంద్రంగా చేసుకుని ఎదిగిన ఒక స్వదేశీ దిగ్గజ సంస్థ, ఏకంగా 9,500 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించే లిథియం-అయాన్ గిగాఫ్యాక్టరీ ప్రాజెక్టును పొరుగు రాష్ట్రానికి తరలించాల్సి రావడంపై ఏపీలో రాజకీయం ప్రారంభమయింది. ఈ పరిణామాన్ని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రంగానికి జరిగిన తీరని లోటుగా అభివర్ణిస్తూ, తెలుగుదేశం పార్టీ గతాన్ని తవ్వి తీస్తూ వైఎస్సార్‌సీపీపై తీవ్రంగా విమర్శలు చేస్తోంది. ఈ ప్రారంభోత్సవం వెనువెంటనే ఏపీ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమాల వేదికగా చేసిన ప్రకటన ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అమరరాజా సంస్థపై సాగిన రాజకీయ కక్షసాధింపు చర్యలు, వేధింపుల కారణంగానే రాష్ట్రం ఒక చారిత్రక పారిశ్రామిక అవకాశాన్ని కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమరరాజా ఛైర్మన్ గల్లా జయదేవ్ కుటుంబానికి ఏపీ సమాజం క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితిని గత ప్రభుత్వం తెచ్చిపెట్టిందని, నాటి జగన్ రెడ్డి సర్కార్ అవలంబించిన విధ్వంసకర విధానాలే ఈ ప్రాజెక్ట్ తెలంగాణ పాలమూరు రంగానికి వెళ్లడానికి కారణమని లోకేష్ తో పాటు టీడీపీ శ్రేణులు తీవ్రస్థాయిలో విమర్శలు ప్రారంభించాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమరరాజా గ్రూప్‌ను రాజకీయ లక్ష్యంగా చేసుకుని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలుఉన్నాయి. గల్లా జయదేవ్ టీడీపీ ఎంపీగా ఉండటంతో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ద్వారా ప్లాంట్ల మూసివేత నోటీసులు ఇవ్వడం, విద్యుత్ , నీటి సరఫరాను అడ్డుకోవడం, కేటాయించిన 253 ఎకరాల పారిశ్రామిక భూములను రద్దు చేసేందుకు ప్రయత్నించడం వంటి చర్యలు చోటుచేసుకున్నాయి. ఈ తీవ్ర ఒత్తిళ్లు, అనిశ్చితి వాతావరణాన్ని తట్టుకోలేకనే అమరరాజా తన భవిష్యత్ విస్తరణ అయిన లిథియం-అయాన్ ఈవీ బ్యాటరీ క్లస్టర్‌ను తెలంగాణకు తరలించాల్సి వచ్చిందని పారిశ్రామిక నిపుణులు సైతం విశ్లేషిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఒకరి నష్టం మరొకరికి లాభంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ యువతకు రావాల్సిన వేలాది ఉద్యోగాలు, రాష్ట్రానికి దక్కాల్సిన కోట్ల రూపాయల పన్ను ఆదాయం నేడు తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు దక్కాయి. తెలంగాణ ప్రభుత్వం సమకూర్చిన అనుకూల వాతావరణంతో దివిటిపల్లి వద్ద అమరరాజా తన ఆసియాలోనే అతిపెద్ద గిగాఫ్యాక్టరీల్లో ఒకదానిని సాకారం చేసుకుంటోంది. చిత్తూరు ప్రాంతంలో ఉపాధి ఆశలు అడుగంటిపోగా, పొరుగు రాష్ట్రం గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారడంపై రాయలసీమ ప్రజల్లోనూ, వ్యాపార వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రస్తుతం ఏపీలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఈ అంశాన్ని ఒక పదునైన కేస్ స్టడీగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పక్కా వ్యూహం సిద్ధం చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవలంబించిన కక్షసాధింపు పారిశ్రామిక విధానాలు ఎవరికీ శ్రేయస్కరం కావని, దాంతో రాష్ట్ర ప్రతిష్ట ఏ విధంగా దెబ్బతిన్నదో వివరించడానికి జిల్లాల వారీగా ప్రచారానికి సిద్ధమవుతోంది. గతం గడిచిపోయినా.. అమరరాజా గ్రూప్ ఏపీలో చేపట్టబోయే ఏ ఇతర నూతన విస్తరణ ప్రాజెక్టులకైనా తమ ప్రభుత్వం ఎర్ర తివాచీ పరుస్తుందని, పూర్తి సహకారాన్ని అందిస్తుందని నారా లోకేష్ పునరుద్ఘాటించారు. కేవలం ఒక్క అమరరాజాయే కాకుండా, గతంలో రాష్ట్రం నుంచి బయటకు వెళ్లిపోయిన సుజలాన్, ఫాక్స్‌కాన్ అసెంబ్లీ యూనిట్లు, ఇతర చిన్న-తరహా పరిశ్రమల నిర్వాహకులకు మళ్లీ భరోసా కల్పిస్తూ ఏపీలో పారిశ్రామిక పునరుజ్జీవనానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇది ‘జగన్ మార్క్ పాలనా వైఫల్యం’పై పోరాటానికి టీడీపీకి దొరికిన బలమైన ఆయుధంగా మారింది. రాబోయే రోజుల్లో ఈ పారిశ్రామిక రాజకీయం ఏపీలో మరింత వేడెక్కడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఆర్గానిక్ బాటలో జగన్

ఏలూరు జూలై 25, డిజిటల్ ప్రపంచంలో పెయిడ్ ట్రాఫిక్ కోసం చాలా మంది డబ్బులు కడుతూంటారు. తమ పోస్టులకు రీచ్ రావడానికి.. తాము చేసే ప్రకటనల్ని ఎక్కువ మంది చూడటానికి.. తమ వీడియోలను ఎక్కువ మంది చూడటానికి డబ్బులు కడుతూంటారు. అయితే నిజానికి అలా కట్టడం వల్ల ఎక్కువ మంది చూడరు. నెంబర్స్ మాత్రమే కనిపిస్తాయి. అంటే ప్రయోజనం కనిపిస్తుంది కానీ.. పనికి రాదు. జగన్ రెడ్డి కూడా అదే మార్క్ రాజకీయాలు చేస్తున్నారు. పూర్తిగా పెయిన్ పాలిటిక్స్ చేస్తూ?ఆర్గానిక్ బాటను మర్చిపోయారు. రాజకీయ నాయకుడు ఏదైనా కార్యక్రమం చేస్తే ప్రజల భాగస్వామ్యం ఉండేలా చేసుకోవాలి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన, సహజమైన సమస్యలను పట్టుకుని బాధితుల మధ్యకు వెళ్తున్నప్పుడు వారిని కలవాలి. కానీ జగన్ రెడ్డి ఆ సమస్య పేరుతో తాను ఓ డ్రామా సృష్టించుకుని దానిలో నటించి వెళ్లిపోతారు. సమస్య ఏదైనా సరే, దాని చుట్టూ కొంతమంది నేతలతో ఒక ఆర్టిఫిషియల్ డ్రామా నడిపిస్తే చాలు రాజకీయం చేయవచ్చని జగన్ భావిస్తున్నారని, కానీ ఈ వ్యూహం ప్రజల్లో ఆయన నమ్మకాన్ని మరింత దిగజారుస్తోంది. ఇటీవల అక్వా రైతులు



తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారంటూ వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున హడావుడి చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో అక్వా రైతుల వద్దకు వెళ్లి వారి బాధలు వినకుండా.. ఫేక్ సభ పెట్టి .. పార్టీ నేతలతో మాట్లాడి డ్రామా పాలిటిక్స్ చేశారు. ఈ పోరాటం ఏ ఒక్క అసలైన అక్వా రైతునూ కదిలించలేకపోయింది. ఇప్పుడు అదే తరహా మైండ్ గేమ్ పొగాకు రైతుల విషయంలోనూ పునరావృతమవుతోంది. అసలైన రైతులతో కనెక్ట్ కాకుండా, కేవలం కెమెరాల ముందూ, ముందస్తుగా సిద్ధం చేసిన స్క్రిప్టుల చుట్టూ రాజకీయాలు నడపడం వల్ల ప్రతిపక్షంగా సాధించే ప్రయోజనమేమీ లేకుండా పోతోంది. ఈ శైలి వెనుక జగన్ ఎదుర్కొంటున్న ఓ రకమైన ఆత్మన్యూనతా భావం ఉంది. తాను బయటకు వెళ్తే జనాలు రారేమో, భద్రత లేదా ఆదరణ విషయంలో వ్యతిరేక సంకేతాలు వెళ్తాయేమో అనే ముందస్తు భయంతోనే ఆయన కృత్రిమ వాతావరణాన్ని, సొంత పార్టీ క్యాడర్‌తో సభలను ఏర్పాటు చేసుకుని రాజకీయం మమేకం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రజాకర్షణ ఉన్న నాయకుడిగా పేరొందిన జగన్.. ఇలా ఆర్టిఫిషియల్ పరిమితులకు పరిమితం కావడం వెనుక సజ్జల రామకృష్ణారెడ్డి వంటి సలహాదారుల బ్రెయిన్ వాష్ ప్రభావం చాలా ఉందనేది సొంత పార్టీ నేతల ఆవేదన. కానీ జగన్ రాజకీయం అంటే డ్రామాలే అని గట్టిగా నమ్ముతున్నారు.

# పంట కాలువలో ముగ్గురు దుర్మరణం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ రామచంద్రపురం మండలం వెంకటపాలెం గ్రామ సమీపంలోని పంట కాలువలో స్నానానికి దిగిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో కనికెళ్ళ రంజిత్ కుమార్(15), బొక్క వీరేంద్ర(18), వేమన పావని(15) మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతులు కపిలేశ్వరపురం మండలం అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి గ్రామాలకు చెందినవారు. వీరు అక్కాచెల్లెళ్ల పిల్లలు కాగా ప్రస్తుతం హైదరాబాద్ లో నివసిస్తున్నారు. రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామంలోని అమ్మ ఇంటికి నిన్న జరిగిన తాతయ్య సంస్కార కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చారు. ఈరోజు సమీపంలోని వెంకటపాలెం పంట కాలువలో స్నానానికి వెళ్లి ఈ ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు మంత్రి సుభాష్ తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఈ ఘటనతో వెలంపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

## స్వామి వారి దయతో కూటమి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి

విశాఖపట్నం, క్రీడాశాఖల మంత్రి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. . ఆలయ మర్యాదలతో మంత్రికి ఇూ వెంకట్రావు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీవాసచార్యులు పూర్ణకుంభంతో మర్యాదపూర్వక స్వాగతం పలికారు మండపంలో రాతి సానలపై చందనం చెక్కలను గంధం అరగదీసారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మంత్రికి ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వామి వారి దయతో కూటమి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి సాగిస్తోందని రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం మంత్రి స్వామివారిని ప్రార్థించారు.

# ఉండవల్లి లో కొవ్వొత్తుల ర్యాలీ

ఉండవల్లి సెంటర్ నీట్ పేపర్ లీకేజీ కి వ్యవహారంపై ఢిల్లీ లో జంతర్ మంతర్ దగ్గర తమ ఆందోళన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీ చార్జి కి నిరసనగా రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు ఉండవల్లి సెంటర్లో జరిగిన ఈ ర్యాలీలో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పేపర్ లీకేజ్ అనేది ఒక హేయమైన చర్య యువత భవిష్యత్తుతో చలగాటం ఆడుతున్న ఈ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు బుద్ధి

చెప్తారని పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ తక్షణమే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన రైతు సంఘం నాయకులు ×ఈ కార్యక్రమంలో ఏపీరైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్న శివ శంకర్, రైతు సంఘం కోశాధికారి నూరి నారాయణ, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుయు రాజశేఖర్, యుటిఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఏం రవి, సిఐటియు గుంటూరు జిల్లా నాయకులు కే జగదీశ్వర్ రెడ్డి, రైతు సంఘం రాజధాని డివిజన్ కార్యదర్శి డి శ్రీనివాస కుమారి, మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి వెంకట్ రెడ్డి, రైతు సంఘం తాడేపల్లి రూరల్ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో ,ప్రతి మండలంలో,ప్రతి నియోజకవర్గ లో ,ప్రతి జిల్లా కేంద్రంలో రాష్ట్రమంతటా మా కుల ఆరాధ్య దైవమైన కనకదాసుల వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చిన రాష్ట్ర కురువ/కురుబ/కురుమ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కురువ శివారామ్





విభారే న్యూస్ .కర్నూలు ప్రతినిధి జూలై 25 నూతనంగా ఎన్నికైన రాష్ట్ర యువజన సంఘం నాయకుడిని మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రాలయం కురువ నాయకులు మాజీ సర్పంచ్ రామాంజనేయులు అలాగే వారి బృందం.మంత్రాలయం పరిధిలో ఐరనగల్లు గ్రామంలో కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ మరియు గుడి నిర్మాణం కొరకు తనవంతు సహాయం చేసారు,కనకదాసులు వారు మా కులం ఆరాధ్య దైవం ఆయన ఒక ప్రముఖ భక్తుడు, కవి, తత్వవేత్త మరియు సంగీత స్వరకర్త. భక్తి తత్వంతో పాటు కులమత భేదాలను వ్యతిరేకిస్తూ సంఘ సంస్కర్తగా గుర్తింపు పొందారు. సాహిత్యం: కన్నడ భాషలో ఎన్నో భక్తి కీర్తనలు, ఉగాభోగాలు రచించారు.ఉడిపి కృష్ణుడు: ఉడిపి శ్రీకృష్ణ మఠంలో స్వామివారు కనకదాసు కోసం వెనక్కి తిరిగి దర్శనం ఇచ్చారనే ప్రసిద్ధ కథ ఉంది (దీనినే 'కనకన కిండి' లేదా కనకదాసు కిటికీ అంటారు).ఇలాంటి మహనీయులు మా కులం లో జన్మించడం మా కులం యొక్క పూర్వజన్మ సుకృత అని కొనియాడారు. అలాగే ఇలాంటి కనకదాసుల వారి విగ్రహ ప్రతిష్ఠ గుడి నిర్మాణం కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ ప్రాంతంలలోనైనా మొదలుపెట్టిన కురువ సోదరలందురు రాష్ట్రంలో తమవంతు సహాయం సహకారం చేయాలని,అలాగే రాష్ట్రంలో కురువలంతా ఐక్యంగా ఉండి కుల ఐక్యత కు అభివృద్ధి కి ఐక్యతతో కృషి చేయాలని కోరిన యువజన సంఘము రాష్ట్ర అధ్యకులు కురువ శివరాం.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురువ సంఘం సహాయ కార్యదర్శి బి ఎన్ టాకీస్ వెంకటేష్,కురువ మల్లికార్జున్, బావిగడ్డ రంగయ్య,కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు

## అమృత్-2 పనులకు సోమవారం భూమిపూజ--

### హాజరు కావాలని కమిషనర్ పిలుపు-

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 25:అమృత్-2 పథకం కింద ఈ నెల 27న సోమవారం నంద్యాలలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.



అనంతరం నూతన మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ), చిన్న చెరువు కట్ట అభివృద్ధి పనులు, మహానంది రోడ్డులోని హెడ్ వాటర్ వర్క్స్‌లో తాగునీటి సరఫరా పనులకు భూమిపూజలు నిర్వహిస్తారు.ఈ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, జిల్లా ప్రత్యేకాధికారి రాజకుమారి గణియా హాజరవుతారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు తప్పక పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ బండి శేషన్న కోరారు.

## పీజీఆర్ఎస్ అభిప్రాయ సేకరణకు ప్రాధాన్యం--

### మెప్మా పీడీ వెంకటదాస్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 25-: ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)పై అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటదాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం మెప్మా కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌కు సంబంధించిన క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు.



ఈ సందర్భంగా వెంకటదాస్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ ద్వారా ప్రజలు అందించిన ఫిర్యాదుల పరిష్కారంపై తమ అభిప్రాయాలను క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సులభంగా నమోదు చేయవచ్చన్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, అభిప్రాయాలు ప్రభుత్వ సేవల నాణ్యతను పెంపొందించడంలో కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ అభిప్రాయాలను నమోదు చేయాలని ఆయన కోరారు.

## సేవా కార్యక్రమాలకు రాజకీయ అడ్డంకులు:: శిల్పా రవిచంద్ర

### --122 మంది మహిళలకు రూ.22.10 లక్షల రుణాల పంపిణీ



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 25-రాజకీయ కక్షలతోనే శిల్పా సేవా సమితి నిర్వహిస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆరోపించారు. శిల్పా సేవా సమితి కార్యాలయంలో శిల్పా మహిళా సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో 122 మంది మహిళా లబ్ధిదారులకు రూ.22.10 లక్షల విలువైన రుణాల చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టెక్కే వ్యవసాయ మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్‌లో శిధిలావస్థలో ఉన్న షాపులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం తీసుకుని సొంత నిధులతో మరమ్మతులు చేసి అభివృద్ధి చేశామని తెలిపారు. అక్కడ నిర్వహిస్తున్న శిల్పా సహకార సూపర్ మార్కెట్, శిల్పా మహిళా బ్యాంక్, నంది రైతు సహకార్ సేవలను ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారని విమర్శించారు.శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అందుతున్న సేవలను అడ్డుకోవడం వల్ల ప్రజలకే నష్టం జరుగుతోందన్నారు. సూపర్ మార్కెట్‌లో పనిచేస్తున్న 40 మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయారని, రైతుల స్థలాలను పార్టీ అవసరాలకు కేటాయించడం సరికాదన్నారు. ఖాళీ చేయించిన శిల్పా మహిళా సహకార బ్యాంక్‌ను త్వరలో పద్మావతి నగర్‌లో తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ హరిలీల, మహిళా ఖాతాదారులు, శిల్పా సేవా సమితి సిబ్బంది పాల్గొన్నారు.

## జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా--

### ప్రత్యేక సవరణ షెడ్యూల్ వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 25:భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సవరణ కార్యక్రమానికి సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు.జిల్లాలో బీఎల్‌వోల ద్వారా ఇంటింటి సర్వే ప్రక్రియ జూలై 24తో పూర్తయిందని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ కూడా ముగిసిందని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాను జూలై 31న ప్రచురిస్తామని పేర్కొన్నారు.ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, దరఖాస్తులను జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు స్వీకరిస్తామని, వాటిని సెప్టెంబర్ 28లోగా పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 3న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 14,05,443 మంది ఓటర్లు ఉండగా, వారిలో 12,25,937 మంది వివరాలు డిజిటలీకరణ పూర్తయ్యాయని తెలిపారు. ఇది 87.23 శాతం కాగా, 1,79,506 మంది ఓటర్ల వివరాలు ఇంకా వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.



పెండింగ్‌లో ఉన్న వివరాల్లో మరణించినవారు 52,271 మంది, శాశ్వతంగా నివాసం మార్చుకున్నవారు 67,421 మంది, ఇంట్లో అందుబాటులో లేనివారు 24,143 మంది, ఇప్పటికే ఓటరు జాబితాలో నమోదైనవారు 35,670 మంది ఉన్నట్లు తెలిపారు.అలాగే జిల్లాలో ప్రస్తుతం ఉన్న 1,200 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 134 హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు ఎన్నికల సంఘానికి పంపినట్లు వెల్లడించారు. వాటి ప్రకారం 1,629 పోలింగ్ కేంద్రాలను 1,763 పోలింగ్ కేంద్రాలుగా పునర్వ్యవస్థీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

## ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తి--

### వివరాలు వెల్లడించిన నంద్యాల అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 25:భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ?2026 కార్యక్రమం నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో జూలై 24తో విజయవంతంగా పూర్తయిందని నంద్యాల అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జూన్ 15 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరిని ప్రత్యక్షంగా కలుసుకుని వివరాలను సేకరించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా వాటిని నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్వహించినట్లు పేర్కొన్నారు.నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,76,813 మంది ఓటర్లు ఉండగా, వారందరికీ గణన పత్రాలు అందజేసినట్లు తెలిపారు. అందులో 2,24,506 పత్రాల వివరాలను నమోదు చేసినట్లు వెల్లడించారు.అదేవిధంగా పరిశీలనలో 10,489 మంది మరణించిన ఓటర్లు, 23,301 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు, 10,196 మంది గృహ సందర్శన సమయంలో అందుబాటులో లేని లేదా గైర్హాజరైన ఓటర్లు, 8,321 మంది ఇప్పటికే ఇతర నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదైన వారు గుర్తించినట్లు తెలిపారు.ఓటర్ల జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందించే లక్ష్యంతో ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం తదుపరి ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.



## మహానందిలో తొలి ఏకాదశి వైభవం--

### ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక శోభ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 25-: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మహానంది శ్రీ మహానందీశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం శ్రీ కామేశ్వరీ అమ్మవారు, శ్రీ మహానందీశ్వర స్వామివార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు వైభవంగా జరిపారు.ఈ కార్యక్రమాలు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా జరిగాయి. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.



## పీజీఆర్ఎస్ అర్జీలపై కలెక్టర్ సమీక్ష--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 25: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శనివారం సమీక్ష నిర్వహించారు. తన ఛాంబర్ నుంచి అర్జీదారులకు నేరుగా ఫోన్ చేసి సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు.'అన్నదాత సుఖీభవ', 'పీఎం కిసాన్' పథకాల నిధులు జమయ్యాయని అర్జీదారులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అర్జీలపైనా సమీక్షించి, ప్రతి ఫిర్యాదును నిర్ణీత గడువులో నాణ్యతతో పరిష్కరించాలని, పరిష్కారం అనంతరం అర్జీదారులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు.

## మార్కెట్ యార్డు పరిరక్షణకు మహాసత్యాగ్రహం

### --ఉద్యమం కొనసాగుతుందన్న అఖిలపక్ష ఐక్యవేదిక



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 25: నంద్యాల మార్కెట్ యార్డు, నూనెపల్లె మార్కెట్ యార్డు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) పరిరక్షణ కోరుతూ అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం మార్కెట్ యార్డు వద్ద మహాసత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. రైతు, ప్రజా, రాజకీయ సంఘాల నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం మార్కెట్ యార్డును పరిరక్షించాలని, ఆర్ఏఆర్ఎస్‌లోని తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు.మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల భూములను రాజకీయ అవసరాలకు వినియోగించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం అఖిలపక్ష నాయకులు రైతుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

## 594 మొబైళ్లను బాధితులకు అందజేసిన ఎస్పీ--

### రూ.1.06 కోట్ల విలువైన ఫోన్ల రికవరీ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 25: నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఆరవ విడత మొబైల్ రికవరీ మేళాలో వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి రికవరీ చేసిన 594 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ బాధితులకు అందజేశారు. వీటి మొత్తం విలువ రూ. 1,06,92,590గా అధికారులు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్త, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మార్గదర్శకత్వంలో ప్రత్యేక బృందం మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గోవా, తెలంగాణతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మొబైళ్లను రికవరీ చేసింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్లలో వ్యక్తిగత, బ్యాంకింగ్ సమాచారం ఉండటంతో వాటిని జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. మొబైల్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని లేదా 9121101107 వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపి వివరాలు నమోదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.నంద్యాల జిల్లాలో ఇప్పటివరకు 4,189 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేయగా, వాటి మొత్తం విలువ రూ. 7,95,87,519గా ఉందని తెలిపారు.కార్యక్రమంలో నంద్యాల ఏఎస్పీ సుస్మిత , అదనపు ఎస్పీ ఖాదర్ భాషా, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**